నగరంలో ఆర్‌టీసీ వర్క్‌షాపు వద్ద రోడ్డుపై నిలిచిన వరద నీరు

సైదాపూర్ కల్వర్టు మీదుగా ప్రవహిస్తున్న వరదనీరు

కరీంనగర్ రూరల్: మొగ్దుంపూర్ వద్ద ప్రవహిస్తున్న ఒర్రెతో నీట మునిగిన వరి

# వానొచ్చె.. వరదొచ్చె

- జిల్లాలో మత్తడి దుంకిన చెరువులు, కుంటలు
- వివిధ గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- సహాయక చర్యల్లో నిమగ్నమైన అధికార యంత్రాంగం

***జిల్లా వ్యాప్తంగా ఆదివారం భారీ వర్షంతో జనజీవనం అతలాకుతలం అయింది. చెరువులు, కుంటలు వరద నీటితో మత్తడి దుంకుతుండడంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పంటపొలాలు నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అధికారులు సహాయక చర్యలు చేపట్టడంతోపాటు భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.***

కార్పొరేషన్, సెప్టెంబర్ 1: భారీ వర్షంతో నగరం అతలాకుతలం అయింది. శనివారం రాత్రి నుంచి వర్షం కురువగా నగరంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. అనేక ప్రధాన రహదారులపై వరద నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. నగరంలోని రాంనగర్, మంచిర్యాల చౌరస్తా, ఎన్‌టీఆర్ చౌరస్తా, హౌసింగ్‌బోర్డు కాలనీ రోడ్డు, ఆర్‌టీసీ వర్క్‌షాపు, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారులపైకి వరదనీరు భారీగా చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అలాగే నగరంలోని సాయినగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ, జ్యోతినగర్, శ్రీహరినగర్, విద్యానగర్ తదితర కాలనీల్లోని పలు ఇళ్లల్లోకి వరదనీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. ముకరంపురలోని విమానం వీధిలోనూ భారీగా వరదనీరు చేరింది. టు టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ప్రధాన మురుగుకాల్వ నిండుగా ప్రవహించడంతో చుట్టూ ఉన్న వీధుల్లోని వరదనీరు చేరి నిలిచిపోయింది. ముఖ్యంగా వాణీనికేతన్ స్కూల్ రోడ్డులో వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. హౌసింగ్‌బోర్డు కాలనీలోని పలు ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. భగత్‌నగర్, కలెక్టరేట్ సమీపంలో రోడ్లపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. వెంటనే స్పందించిన నగరపాలక సంస్థ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో మురుగు కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించే పనులు చేపట్టారు. భారీ వర్షంలోనూ నగరపాలక పారిశుధ్య సిబ్బంది పనుల్లో నిమగ్నమయ్యారు. కాలనీల్లో వరదనీరు సులువుగా వెళ్లేందుకు వీలుగా మురుగు కాల్వల్లో చెత్త తొలగించారు. నగరంలో ఉదయం కొద్ది సేపు వర్షం తగ్గుముఖం పెట్టడంతో వరదనీరు కిందికి తరలివెళ్లింది. కాగా, మళ్లీ సాయంత్రం నుంచి భారీ వర్షం కురుస్తుండడంతో ఎలాంటి ఇబ్బందులు వస్తాయోనన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతున్నది. అలాగే నగరంలోని సాయినగర్, శర్మనగర్ తదితర ప్రాంతాల్లో ప్రధాన మురుగు కాల్వ నిండుగా ప్రవహించడంతో చుట్టు ఉన్న వీధుల్లోకి వరదనీరు నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడ్డారు. రేకుర్తిలోని 18, 19వ డివిజన్లలోనూ పలు వీధుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కాగా, తాత్కాలికంగా కచ్చా కాల్వల ద్వారా నీటిని తరలించేందుకు స్థానిక కార్పొరేటర్లు, అధికారులు పనులు చేపట్టారు.

**సమస్యలపై కాల్ సెంటర్**

నగరంలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు సమాచారం అందించాలని అధికారులు కోరారు. ఇందుకోసం 0878-2237700, 9849906694 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

హుజూరాబాద్ టౌన్: 17వ వార్డులో ఇంట్లోకి చేరిన వరదనీరు

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 1: మండలంలోని చామనపల్లి, చెర్లభూత్కూర్, మొగ్దుంపూర్, జూబ్లీనగర్ గ్రామాల్లో వందల ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. చామనపల్లి, బహద్దూర్ ఖాన్ పేట మధ్య ఉన్న చామనపల్లి ఎస్సీకాలనీలోని వాగు పొంగి ప్రవహించడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే వివిధ గ్రామాల మధ్య వరదతో రవాణా సౌకర్యం నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. దుర్శేడ్‌లో కరీంనగర్- పెద్దపల్లి రాజీవ్ రహదారిపై, నగునూర్ గ్రామంలో చొప్పదండి-కరీంనగర్ రహదారిపై నీరు నిలువడంతో గ్రామపంచాయతీ అధికారులు జేసీబీలతో తొలగించారు. దుర్శేడ్ గ్రామంలోని 1, 2వ వార్డుల్లోని ఇండ్లల్లోకి నీరు చేరడంతో గ్రామ ప్రత్యేకాధికారి, మండల పంచాయతీ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి కాలువ తీయించారు. గోపాల్‌పూర్‌లో కేసీఆర్ భవన్ వైపు రహదారిపై నీరు నిలిచి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ఇరుకుల్ల వాగు, నగునూర్ వాగులు ఉధృతంగా ప్రవహించడంతో నగునూర్ చెక్ డ్యాం, దుర్శేడ్, గోపాల్‌పూర్ చెక్‌డ్యాంలు మత్తడి దుంకుతున్నాయి.

రామడుగు : కోతకు గురైన గుండి-దేశాయిపేట దారిని పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి, సెప్టెంబర్1 : కొత్తపల్లి చెరువు నిండి అలుగు పోస్తుండగా గ్రామాల్లో చెరువులు నిండుకుండలా మారాయి. లక్ష్మీపూర్ గ్రామంలోని వరదనీరంతా శ్రీ లక్ష్మీ హోంలోకి వెళ్లడంతో కాలనీలోని ఇళ్లన్నీ పూర్తిగా నీట మునిగాయి.

జమ్మికుంట, సెప్టెంబర్ 1: జమ్మికుంట పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. చెరువులు, కుంటలు నిండి మత్తడి పడుతున్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తహసీల్దార్ రమేశ్‌బాబు, సీఐ రవి, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, కమిషనర్ ఆయాజ్, తదితరులు పరిశీలించారు.

హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్ 1: పట్టణంలో భారీ వర్షానికి పలు కాలనీల్లో ఇండ్లల్లోకి వరద నీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుడగజంగాల కాలనీలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సహాయక చర్యలు చేపట్టారు. మామిండ్లవాడలో ఓ ఇంటికి స్వల్పంగా నష్టం కలగడంతో తహసీల్దార్ కనకయ్య ఆదేశాలతో ఆ ఇంటి యజమానిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. పట్టణంలోని నీటి పారుదల శాఖ కార్యాలయం ఎదుట నీరు నిలిచిపోయింది. వరదనీరు భారీగా చేరి మోడల్ చెరువు, గుండ్ల చెరువులు మత్తళ్లు దుంకుతున్నాయి. చిలుకవాగు ఉధృతంగా ప్రవహించడంతో శ్మశానవాటికకు, వడ్డెరకాలనీకి, కనుకుల గిద్దె గ్రామానికి రవాణా సౌకర్యం దెబ్బతింది. వడ్డెరకాలనీ వాసులు చుట్టూ 8కిలోమీటర్లు ప్రయాణించి పట్టణానికి రావాల్సిన పరిస్థితి నెలకొంది. బతుకమ్మ సౌడ్ల వద్ద ఉన్న చెక్ డ్యాం పూర్తిగా మునిగిపోయింది. పంటపొలాలు నీట మునిగిపోయాయి. వరంగల్ వెళ్లే ప్రధాన రహదారిపై నీరుచేరి, ట్రాఫిక్‌కు స్వల్పంగా అంతరాయం ఏర్పడింది. హెచ్‌పీ బంక్ సమీపంలోని పెద్ద మోరి ఉధృతంగా ప్రవహించింది.

వీణవంక, సెప్టెంబర్ 1: మండలంలో కురిసిన భారీ వర్షానికి వాగుపై నిర్మించిన చెక్ డ్యాంలు పొంగిపొర్లుతుండగా, పలు చోట్ల నీటి ప్రవాహానికి రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని పలు చెరువుల్లోకి నీరు చేరి కొన్ని మత్తుళ్లు పడుతుండగా, వీణవంక వాగుపై వీణవంక, రామకృష్ణాపూర్, లస్కుక్కపల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాల వద్ద నిర్మించిన, మానేరువాగుపై మల్లారెడ్డిపల్లి, కొండపాక, కోర్కుళ్ గ్రామాల వద్ద నిర్మించిన చెక్‌డ్యాంలు పొంగిపొర్లుతున్నాయి. వరి పొలాలు కొన్ని చోట్ల నీట మునుగగా, వీణవంక-నర్సింగాపూర్ గ్రామాల మధ్య 20 మోరీల వద్ద నీటి ప్రవాహానికి, మామిడాలపల్లి గ్రామం గొల్లపల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహానికి కరీంనగర్-జమ్మికుంటకు నడుస్తున్న ఆర్‌టీసీ బస్‌లు, వాహనదారులకు అంతరాయం ఏర్పడగా ప్రయాణికులు కొంతదూరం నడిచి వెళ్లారు.

చిగురుమామిడి: రేకొండ-మొగిలిపాలెం రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

సైదాపూర్, సెప్టెంబర్ 1: మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మండలంలో 132.6 ఎంఎం వర్షపాతం నమోదయింది. వరదనీటి ప్రవాహానికి పలు గ్రామాల్లో రహదారులపై నీరు నిలిచిపోయింది. సైదాపూర్ న్యాల చెరువుతో పాటు పలు చెరువులు, కుంటలు మత్తడి దుంకుతున్నాయి. వరదనీటికి సైదాపూర్, శివరాంపల్లి, సోమారం తదితర గ్రామాల్లో వరి పంటలు నీట మునిగాయి. వెన్కేపల్లి-సైదాపూర్ జంట గ్రామాల్లోని పాతబస్టాండ్ ఆవరణ భారీగా వరదనీరు నిలిచి చెరువును తలపించింది. పాతబస్టాండ్ ప్రాంతంలో పలు ఇండ్లల్లోకి వరద చేరింది. రాయికల్ జలపాతం జాలువారుతున్నది. సైదాపూర్ కల్వర్టు, రాములపల్లి కల్వర్టు వద్ద వరద నీటి ప్రవాహం తీవ్రంగా ఉండడంతో పోలీసు సిబ్బంది అక్కడే ఉండి చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు వర్షాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, సహాయం కోసం పోలీసులకు ఫోన్ చేయాలని ఎస్ఐ ఆరోగ్యం తెలిపారు.

ఇల్లందకుంట, సెప్టెంబర్ 1: ఇల్లందకుంట కొత్త చెరువు, గుండ్ల చెరువు, మల్యాలలో చెరువు, సిరిసేడులో కొత్త చెరువులతో పాటు కుంటలు మత్తడి పడుతున్నాయి, పాతర్లపల్లి గ్రామం వద్ద వాగు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోనున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో తహసీల్దార్ రాణి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, ప్రజలకు పలు సూచనలు చేశారు.

మానకొండూర్, సెప్టెంబర్ 1: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మానకొండూర్ పెద్దచెరువులోకి భారీగా వరద నీరు వస్తున్నది. చెరువులో నీటిమట్టం పెరుగడంతో పెద్దచెరువు జలకళను సంతరించుకుంది.

మానకొండూర్ రూరల్, సెప్టెంబర్ 1: మానకొండూర్ మండలం దేవంపల్లిలోని పాల చెరువు, శ్రీనివాస్‌నగర్‌లోని బర్లాం చెరువులు నిండి, మత్తళ్లు పడుతున్నాయి. గ్రామాల్లోని వీధుల్లో వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరదలో మత్స్యకారులు చేపల వేటను కొనసాగిస్తున్నారు. వర్షాలతో చెరువులు, కుంటలు నిండి మత్తళ్లు పడుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మానకొండూర్ తహసీల్దార్ బండి రాజేశ్వరి విజ్ఞప్తి చేశారు.

చొప్పదండి: భారీ వర్షానికి మత్తడి దుంకుతున్న రేవెల్లి మినీ ట్యాంక్ బండ్

కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై చెంజర్ల, ఖాదరగూడెం గ్రామాల శివారులో ఎన్‌హెచ్ 563 రోడ్డు పనుల్లో భాగంగా చేపట్టిన కల్వర్టులు పూర్తి కాకపోవడంతో ఇరువైపులా పంట పొలాలు వరద నీటిలో మునిగిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు మీదుగా నీరు ప్రవహిస్తుండడంతో వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

శంకరపట్నం, సెప్టెంబర్ 1: కేశవపట్నం, మొలంగూర్, కన్నాపూర్, మెట్‌పల్లి, తదితర గ్రామాల్లో పలు ఇండ్లల్లోకి వరద నీరు చేరింది. కన్నాపూర్, మొలంగూర్ హైస్కూల్ క్రీడా మైదానాలు వరదతో నిండి చెరువులను తలపించాయి. వరద ఉధృతికి అంబాల్‌పూర్ చెరువు కట్టకు మత్తడి వద్ద మరోసారి గండి పడింది. గ్రామానికి చెందిన సముద్రాల శ్రీనివాస్ అనే యువకుడు తన నానమ్మను తీసుకు రావడానికి గండి పడిన దారి గుండా బైక్‌పై కేశవపట్నం వస్తుండగా వాహనం అదుపు తప్పి వరద నీటిలో పడిపోయాడు. చివరకు తాను ఎలాగోలా బయటపడినా తన బైక్ వరద నీటిలో కొట్టుకుపోయిందని వాపోయాడు. కేశవపట్నం వాగులో భారీగా వరద ఉధృతి కనిపించింది. అర్కండ్ల కాజ్‌వేపై వరద పొంగిపొర్లడంతో రెండువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై వరద నీరు నిలిచి చెరువును తలపించింది. గతేడాది కల్వల ప్రాజెక్టుకు మత్తడి వద్ద పడ్డ గండిని పూడ్చి మరమ్మతులు చేయకపోవడంతో ప్రాజెక్టులోకి వాగులు, చెరువుల ద్వారా భారీగా వస్తున్న వరద నీరు వృథాగా దిగువకు పోతుండడంతో రైతులు, మత్స్యకారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే నిర్మాణ దశలో ఉన్న 563 జాతీయ రహదారి పలు చోట్ల ధ్వంసమై రోడ్డుకు కోత పడింది. భారీ వర్షాలకు డ్రైనేజీలు, రోడ్లు, కాలువలు, వాగులు వరద ఉధృతితో ప్రవహిస్తున్నందున అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావద్దని ఎస్ఐ కే రవి హెచ్చరించారు.



కొత్తపల్లి: లక్ష్మీపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీ హోమ్స్‌లోకి చేరిన వరద

తిమ్మాపూర్, సెప్టెంబర్ 1: తిమ్మాపూర్ గ్రామంలో లోతట్టు వీధుల్లో నీళ్లు చేరాయి. నుస్తులాపూర్‌లో లోతట్టు ప్రాంతాల్లో నీట మునిగిన ఇండ్లను బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ రావుల రమేశ్ పరిశీలించి, బాధిత కుటుంబాలకు బియ్యం అందజేశారు. పోలంపల్లి గ్రామ సమీపంలో మొగిలిపాలెం వెళ్లే రోడ్డుపై వరదతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే మన్నెంపల్లిలో వరదలకు పలువురి ఇండ్లల్లోకి నీళ్లు చేరాయి. ఇంట్లోకి నీళ్లు రావడంతో ఇబ్బందులు పడుతున్న వృద్ధ దంపతులకు మాజీ సర్పంచ్ మేడి అంజయ్య, నాయకులు పునరావాసం ఏర్పాటు చేశారు.

తిమ్మాపూర్ రూరల్, సెప్టెంబర్ 1: మండలంలోని ఇందిరానగర్ నుంచి మన్నెంపల్లి వెళ్లే దారిలో గల కుంటను తహసీల్దార్ విజయ్ కుమార్ ఎంపీడీవో విజయ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. మత్తడి నీరు రోడ్డు కల్వర్టు మీదుగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు జరుపకుండా తాత్కాలికంగా రోడ్డుకు ఇరు వైపులా ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. మన్నెంపల్లి గ్రామానికి చెందిన సిర్ర లక్ష్మి ఇల్లు పాక్షికంగా దెబ్బ తినడంతో దానిని పరిశీలించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ లక్ష్మణ్, ఆర్ఐ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం, సెప్టెంబర్ 1 : మండలంలోని చెరువు, కుంటలు నిండుకుండలా మారి అలుగుపడుతున్నాయి. దీంతో మండలంలో పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. గునుకుల కొండాపూర్ గ్రామంలో మురుగు కాలువ వ్యవస్థ సరిగా లేక లోతట్టు ప్రాంతంలో ఉన్న ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. గుండ్లపల్లిలో చెరువు మత్తడి ప్రవాహాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు.

చిగురుమామిడి, సెప్టెంబర్ 1: చిగురుమామిడి, రేకొండ, ఇందుర్తి, బొమ్మనపల్లి, ముల్కనూర్ తదితర గ్రామాల్లో చెరువులు మత్తడి దుంకాయి. చిగురుమామిడి-రేకొండ రహదారి మధ్య కుంట నుంచి భారీగా నీరు ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. రేకొండ-మొగిలిపాలెం రహదారిపై భారీగా నీరు ప్రవహించడంతో ఆదివారం తెల్లవారి నుంచి రాకపోకగా నిలిచిపోయాయి. రేకొండ- ఎగ్లాస్‌పూర్ మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇందుర్తి, కోహెడ రహదారిపై ఎల్లమ్మ వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఆదివారం తెల్లవారుజాము నుంచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రామంచలో మోయతుమ్మెద వాగు ఉధృతంగా ప్రవహించింది. సుందరగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలోకి వరదనీరు ప్రవేశించింది. బొమ్మనపల్లి, సుందరగిరి నవాబ్‌పేట్, రేకొండ గ్రామాల్లో పలు ఇండ్లల్లోకి నీరు చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సుందరగిరి, ముదిమాణిక్యం గ్రామాల్లో పాక్షికంగా ఇల్లు దెబ్బతిన్నాయి. రేకొండ ఊరి చెరువుకు బుంగపడడంతో ఎంపీడీవో ఖాజా మొయినొద్దీన్ యుద్ధ ప్రాతికంగా చర్యలు చేపట్టారు. ఆయా చోట్ల పరిస్థితులను తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో ఖాజా మొయినొద్దీన్, ఎస్ఐ రాజేశ్ పర్యవేక్షించారు.

చొప్పదండి, సెప్టెంబర్ 1: మండలంలోని అర్నకొండ నుంచి రాగంపేట వైపు వెళ్లే రోడ్డుపై ఉన్న పంది వాగు భారీ వర్షాలకు పొంగిపొర్లుతూ రోడ్డుపై నుంచి భారీగా ప్రవహిస్తున్నది. దీంతో రాగంపేట, రేవెల్లి, పెద్దకుర్మపల్లెకు చొప్పదండి పట్టణానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఉధృతంగా ప్రవహిస్తున్న పంది వాగును ఎస్ఐ అనూష పరిశీలించి, ప్రమాదాలు నివారించేందుకు దారికి అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అధిక వర్షాలు కురుస్తున్నందున మున్సిపల్ కార్యాలయంలో అత్యవసర సేవల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నాగరాజు పేర్కొన్నారు. అత్యవసర సేవల కోసం కంట్రోల్ రూం సెంటర్‌లోని సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

గంగాధర, సెప్టెంబర్ 1: భారీ వర్షాలకు వెంకటాయపల్లి వాగులో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి భారీగా వరదనీరు చేరుతున్నది. రిజర్వాయర్ వద్ద నీటి మట్టం పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. భారీ వర్షాలకు కరిక్యాల-ఉప్పరమల్యాల, గంగాధర-బూరుగుపల్లి గ్రామాల మధ్య రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లక్ష్మీదేవిపల్లి బ్రిడ్జిపై వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వరద నీటిని పరిశీలించారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలోనే లక్ష్మీదేవిపల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలు ఇబ్బందులు తీర్చాలన్నారు. ఇక్కడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, నాయకులు దూలం శంకర్‌గౌడ్, సుంకె అనిల్ తదితరులు ఉన్నారు. ర్యాలపల్లి, సర్వారెడ్డి, గట్టుభూత్కూర్ ఊర చెరువులు పూర్తిస్థాయిలో నిండి మత్తడి దుంకుతున్నాయి. వెంకటాయపల్లి వద్ద ఆడెపు స్వాతికి చెందిన ఇంటిలోకి వరద నీరు చేరింది. వరద నీరు వాగులోకి వెళ్లకుండా రివర్స్ వస్తుండడంతో ఇండ్లల్లోకి నీరు చేరుతున్నదని గ్రామస్తులు తెలిపారు.

రామడుగు, సెప్టెంబర్ 1: మండలంలోని గుండి పెద్ద చెరువు, వెలిచాల పెద్ద చెరువు, చిన్న చెరువు, వెదిర సమ్మిళ చెరువు, తిర్మలాపూర్ ఊర చెరువు, చిప్పకుర్తి చెరువు అలుగులు దుంకుతున్నాయి. పైనుంచి వచ్చే వరదతో రామడుగు వాగులో ఉధృతి ఉన్నా ప్రస్తుతం రోడ్డుకు సమానంగా నీరు వెళ్తున్నది. గొలుసుకట్టు చెరువుల ద్వారా వరదనీరు గుండి పెద్ద చెరువుకు చేరడంతో గుండి నుంచి లక్ష్మీపూర్, గుండి నుంచి దేశాయిపేటకు వెళ్లే దారుల్లో రాకపోకలు నిలిచిపోయాయి. కాగా, గుండి నుంచి దేశాయిపేటకు వెళ్లే దారి వరద నీటితో కోతకు గురి కావడంతో మండల ప్రత్యేకాధికారి అనిల్ ప్రకాశ్, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో శ్రవణ్ పరిశీలించారు. తిర్మలాపూర్ ఊర చెరువు కట్ట వర్షాల కారణంగా కూలడంతో అధికారులు పరిశీలించారు. వెలిచాల, కొత్తపల్లి మధ్య రొడ్యాం ప్రతిఏడూ పొంగి రాకపోకలు నిలిచేవి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు మాజీ మంత్రి గంగులతో మాట్లాడి వంతెనను నిర్మించడంతో వెలిచాల బాధలు తప్పాయి.

### పోస్టర్ ఆవిష్కరణ

విద్యానగర్, సెప్టెంబర్ 1: అసోసియేషన్ ఆఫ్ అలెన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 137ఏ కరీంనగర్ ఆధ్వర్యంలో 'మట్టి గణపతిని పూజిద్దాం-పర్యావరణాన్ని కాపాడుదాం' నినాదంతో పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజల్లో అవగాహన పెంచి మట్టి గణపతులను పూజించేలా సుమారు 200 మట్టి గణపతులను అలయన్స్ క్లబ్ మెంబర్స్‌కు, ఆసక్తి ఉన్న వారికి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ చరమల వెంకటేశ్వర్లు, కోలా అన్నారెడ్డి, శ్రీనివాస్ గాంధీ, మహేశ్, పులాస శ్యామ్, సోమవారపు వెంకన్న, పండుగ నాగరాజు, ఈద కుమారస్వామి, నాగేశ్వర్, ప్రసాద్, లక్ష్మీనారాయణ, సీఏ. విజయ్, అనురాధ, కట్కూరి సుధాకర్, వాసుదేవ సిబ్బంది పాల్గొన్నారు.

### కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుతాం

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 1: కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తమ పోరాటాలను కొనసాగిస్తామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ స్పష్టం చేశారు. నగరంలోని కోతిరాంపూర్‌లో గల సీఐటీయూ కార్యాలయంలో నాలుగు రోజు పాటు నిర్వహించనున్న సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ రాజకీయ శిక్షణ తరగతులను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమావేశంలో హైదరాబాద్ జిల్లా కోశాధికారి అజయ్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

### కుంకుమార్చనలు... సుమంగళి పూజలు

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 1: శ్రావణ మాస ముగింపు సందర్భంగా ఆదివారం మాండవ్య నదీతీరం, దేవళ్లపురి, శివభక్త మార్కండేయస్వామి దేవాలయంలో మహాలక్ష్మీ దేవీ కుంకుమార్చనలు, సుమంగళి పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు పరస్పరం పసుపు కుంకుమలను వాయినంగా పంచుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సంక్షేమ ట్రస్టు అధ్యక్షుడు చిలుక నరసప్ప, వినోద, ప్రసన్న, కవిత, సంధ్య, మంజుల, రమ, సునీత, సావిత్రి, లోకేందర్, తిరుపతి, అనిల్ పాల్గొన్నారు.

### నేటి ప్రజావాణి రద్దు

కలెక్టరేట్, సెప్టెంబర్ 1: ప్రజాసమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం జరుగాల్సిన ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్న క్రమంలో ప్రజావాణి రద్దు చేసినట్లు పేర్కొన్నారు. దీనిని ప్రజలు గమనించాలని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె సూచించారు.

### అధికారులు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

ఫోన్‌లో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్ 1: విస్తారంగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి ఫోన్‌లో ఆర్డీవోతో మాట్లాడారు. హుజూరాబాద్ పట్టణంలోని 17వ వార్డు, జమ్మికుంట హౌసింగ్ బోర్డ్ కాలనీ జలమయమైందని, తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే అన్ని ప్రాంతాలను ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాలని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు.

### లోతట్టు ప్రాంతాల్లో డిప్యూటీ మేయర్ పరిశీలన

సాయినగర్‌లో వరద పరిస్థితిని పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీహరిశంకర్

కార్పొరేషన్, సెప్టెంబర్ 1: నగరంలో భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీహరిశంకర్ ఆదివారం పర్యటించారు. సాయినగర్, శర్మనగర్‌లోని వీధులు, ఇళ్లల్లోకి నీరు చేరడంతో ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఇక్కడి ప్రధాన కాల్వ పనులకు టెండర్లు అయినా పనులు సాగకపోవడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని స్థానిక కార్పొరేటర్ మెండి శ్రీలతాచంద్రశేఖర్, ప్రజలు డిప్యూటీ మేయర్‌కు వివరించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్